సాక్షి
నారాయణపేట

ఆదివారం ׀ 29 ׀ డిసెంబర్ ׀ 2024



హోరాహోరీగా కబడ్డీ పోటీలు

సీఎం కప్ రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలు హోరాహోరీగా సాగుతున్నాయి.

వివరాలు 8లో ▸



ముమ్మరంగా కొనుగోళ్లు

ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం సేకరణ ముమ్మరంగా సాగుతోంది.

వివరాలు 9లో ▸

వాతావరణం


గరిష్టం/కనిష్టం
32.4 /15.8

రోజంతా చల్లని గాలులు వీస్తాయి. చలి తీవ్రత అధికంగా ఉంటుంది. జల్లులు పడే అవకాశం ఉంది.

నా మాటే శాసనం..!

వనపర్తిపై 'కొల్లాపూర్' నేతల పెత్తనం

- నాగర్‌కర్నూల్‌తోపాటు గద్వాల జిల్లాపై సైతం..
- నారాయణపేటపై 'కొడంగల్' ముద్ర
- స్థానిక ప్రజాప్రతినిధులు, శ్రేణుల్లో అసంతృప్తి
- ఒత్తిళ్లతో తలపట్టుకుంటున్న అధికారులు



సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్: 'ఇది నా మాట.. నా మాటే శాసనం'.. ఇది ఓ సినిమాలోని డైలాగ్. దీన్ని పుణికిపుచ్చుకున్నట్లున్నారు ఉమ్మడి పాలమూరుకు చెందిన కొందరు కీలక నేతలు. తమ మాటే శిరోధార్యం.. అందరూ పాటించాల్సిందే అన్నట్లు వ్యవహరిస్తున్నారు. కీలక ప్రజాప్రతినిధుల నీడన వారి ముఖ్య అనుచరులు సైతం చాప కింద నీరులా తమ ప్రాభవాన్ని చాటుతూ.. పెత్తనం చెలాయిస్తున్నారు. పార్టీపరమైన వ్యవహారాలతో పాటు పలు ప్రభుత్వ శాఖల్లో పోస్టింగ్‌లు, ఔట్ సోర్సింగ్ నియామకాల్లో తలదూరుస్తూ చక్రం తిప్పుతున్నారు. పోలీస్‌స్టేషన్లలో పేచీలు, ప్రభుత్వ కార్యాలయాల్లో తదితర పనులకు సంబంధించి తమ హవానే కొనసాగిస్తూ.. పై'చేయి' సాధిస్తున్నారు. ఈ క్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులతో పాటు కేడర్‌లో అసంతృప్తి నెలకొన్నట్లు తెలుస్తోంది.

గద్వాల, నాగర్‌కర్నూల్‌లో..

గద్వాల నియోజకవర్గంలో ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి, జెడ్పీ మాజీ చైర్‌పర్సన్, డీసీసీ అధ్యక్షురాలు సరిత మధ్య వైరం కొనసాగుతోంది. కృష్ణమోహన్‌రెడ్డి బీఆర్‌ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరడానికి కొల్లాపూర్‌కు చెందిన కీలకనేతనే కారణమని పార్టీలో ఇదివరకే ప్రచారం ఉంది. ఈ క్రమంలో సరితను కాదని ఎమ్మెల్యేకు సంబంధించిన వ్యక్తికి మార్కెట్ చైర్మన్ పదవి ఇవ్వడం, ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల ఏర్పాటులోనూ ఆయన వర్గానికే ప్రాధాన్యం ఇవ్వడంపై పార్టీలో భిన్నాభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. ఈ జిల్లాతో పాటు నాగర్‌కర్నూల్‌లో ప్రభుత్వ శాఖల అధికారులు, పోస్టింగ్‌లు, పైరవీలు ఇతరత్రా అంశాల్లో సదరు కీలకనేత, ఆయన అనుచరులదే పైచేయిగా నిలవడంతో స్థానిక నేతలు, శ్రేణులు అసంతృప్తిగా ఉన్నట్లు తెలుస్తోంది.

కారణాలు ఇవేనా..

- రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక వనపర్తి జిల్లాకు సంబంధించి జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ (నామినేటెడ్) పోస్టును భర్తీ చేసింది. వనపర్తి నియోజకవర్గ పరిధిలోని నాయకులను కాదని కొల్లాపూర్ సెగ్మెంట్‌కు చెందిన పాన్‌గల్ మండలానికి చెందిన వ్యక్తికి కట్టబెట్టారు. దీనిపై వనపర్తి నియోజకవర్గానికి చెందిన కాంగ్రెస్ నాయకులు, శ్రేణుల్లో అసహనం వ్యక్తమవుతోంది.
- కీలక ప్రభుత్వ శాఖలకు సంబంధించి అధికారుల పోస్టింగ్‌లు, బదిలీలతో పాటు పైరవీల్లో వనపర్తికి చెందిన ప్రజాప్రతినిధులు, నేతల సిఫార్సులు బుట్ట దాఖలైనట్లు తెలిసింది. కొల్లాపూర్‌కు చెందిన కీలక నేత.. ఆయన వర్గీయుల కోరిక మేరకే వ్యవహరించినట్లు సమాచారం.
- ఇటీవల ఓ ప్రైవేట్ స్కూల్ విద్యార్థి వ్యవసాయ పొలంలో పల్లికాయల కోసం వెళ్లి విద్యుదాఘాతంతో మృతిచెందాడు. ఈ సంఘటనలో కొల్లాపూర్ కు చెందిన ఓ కీలకనేత అనుచరుడు పోలీస్‌ల సమక్షంలోనే రూ.లక్షలు డిమాండ్ చేసినట్లు సమాచారం. వనపర్తి నాయకులు వారిస్తున్నా.. ఒత్తిడి పెంచేందుకు ఓ వ్యక్తిని అనధికారికంగా రాత్రంతా పోలీస్‌స్టేషన్‌లోనే ఉంచినట్లు తెలిసింది.

వనపర్తిలో రాజుకున్న చిచ్చు..

వనపర్తి నియోజకవర్గానికి సంబంధించి అధికార పార్టీ కాంగ్రెస్‌లో గ్రూప్ రాజకీయాలు ఎప్పటి నుంచో ఉన్నాయి. ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి, మాజీ మంత్రి, రాష్ట్ర ప్రణాళిక సంఘం వైస్ చైర్మన్ చిన్నారెడ్డి, తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డి మధ్య పోరు నడుస్తోంది. అసెంబ్లీ ఎన్నికల తర్వాత సైతం మేఘారెడ్డి, చిన్నారెడ్డి మధ్య ప్రొటోకాల్ రగడ చోటు చేసుకుంది. ఇలా నువ్వా, నేనా అన్నట్లు ఇరు వర్గాలు ఆధిపత్యం కోసం ప్రయత్నిస్తుండగా.. కొల్లాపూర్‌కు చెందిన కీలక నేత ఒకరు, ఆయన ముఖ్య అనుచరులు వనపర్తి నియోజకవర్గ పరిధిలో పెత్తనం చెలాయించేలా వ్యవహరిస్తుండడం జిల్లావ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. వనపర్తిలోని పలు ప్రభుత్వ శాఖల్లో కీలక పోస్టింగ్‌లు, బదిలీలు, పైరవీల్లో కొల్లాపూర్ నేతలు తమ మార్క్‌ను ప్రదర్శించడంతో పాటు ప్రతి అంశంలో జోక్యం చేసుకుంటున్నట్లు ఇటీవల వెలుగులోకి రాగా.. పార్టీలో కలకలం చెలరేగింది. ఈ క్రమంలో వనపర్తి సెగ్మెంట్‌లో స్థానిక, స్థానికేతర లొల్లి మరోసారి రాజుకున్నట్లు తెలుస్తోంది.

నారాయణపేటపై 'కొడంగల్' ముద్ర..

వనపర్తి, నాగర్‌కర్నూల్, గద్వాల జిల్లాల్లో కొల్లాపూర్‌కు చెందిన కీలకనేత హవా నడుస్తుండగా.. నారాయణపేటపై కొడంగల్ ముద్ర కొనసాగుతున్నట్లు కాంగ్రెస్ శ్రేణుల్లో చర్చ జరుగుతోంది. జిల్లాలో అధికారుల బదిలీలు, పోస్టింగ్‌లు కొడంగల్ నియోజకవర్గ పరిధిలోని ఓ నేత బంధువు చెప్పినట్లే జరుగుతున్నాయని సమాచారం. కొడంగల్–నారాయణపేట–మక్తల్ స్కీంకు సంబంధించి సబ్ కాంట్రాక్ట్‌లలో ఎవరూ చేయి పెట్టొద్దని స్థానిక నాయకులకు సదరు నేత తేల్చిచెప్పినట్లు పార్టీ వర్గాల్లో గుసగుసలు విన్పిస్తున్నాయి. ఈ క్రమంలో స్థానిక నేతల్లో అసంతృప్తి నెలకొన్నట్లు తెలుస్తోంది. కాగా, బదిలీలు, పోస్టింగ్‌లు, పైరవీలకు సంబంధించి కీలకనేతలతో పాటు స్థానిక నాయకులు సిఫార్సు చేస్తుండడం అధికార యంత్రాంగానికి తలనొప్పిగా మారినట్లు స్పష్టమవుతోంది.

'షేక్'హ్యాండ్..!

రివైండ్ 2024

- పాలమూరులో కాంగ్రెస్‌కు మిశ్రమ ఫలితాలు
- మహబూబ్‌నగర్ పార్లమెంట్, ఎమ్మెల్సీ ఉప ఎన్నికల్లో బోల్తా
- ముఖ్యమంత్రి ప్రతిష్టాత్మకంగా తీసుకున్నా తప్పని పరాభవం
- నాగర్‌కర్నూల్ లోక్‌సభలో మాత్రమే విజయకేతనం
- ఏడాదిలో 14 సార్లు సొంత జిల్లాలో పర్యటించిన రేవంత్
- డీకే అరుణ గెలుపుతో బీజేపీ శ్రేణుల్లో ఉత్సాహం
- బీఆర్‌ఎస్‌కు ఊరటనిచ్చిన నవీన్‌రెడ్డి విజయం

2024లో ఉమ్మడి పాలమూరు జిల్లా రాజకీయ ముఖచిత్రం మారింది. అసెంబ్లీ ఎన్నికల్లో గద్వాల, అలంపూర్ మినహా మిగిలిన 12 స్థానాలను కాంగ్రెస్ కైవసం చేసుకుంది. అంతేకాదు.. రాష్ట్రంలో ఏకైక పెద్ద పార్టీగా ఆవిర్భవించి పాలనా పగ్గాలు చేపట్టింది. అధికార పార్టీ అయినా.. ఈ సంవత్సరం 2024లో జరిగిన ఉమ్మడి మహబూబ్‌నగర్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఉప ఎన్నిక, లోక్‌సభ ఎన్నికల్లో హస్తానికి చుక్కెదురైంది. రెండు పార్లమెంట్ స్థానాల్లో ఒక చోట మాత్రమే విజయం సాధించింది. సీఎం రేవంత్‌రెడ్డి సొంత ఇలాకాలో గెలుపు ముంగిట బోల్తా పడింది. మహబూబ్‌నగర్ లోక్‌సభ స్థానంపై ఆయన ప్రత్యేక దృష్టి సారించినా.. ఎన్నికల వేళ పార్టీ అభ్యర్థికి మద్దతుగా సుమారు పది పర్యాయాలు పర్యటించినా.. ఫలితం లేకపోయింది. మహబూబ్‌నగర్‌లో డీకే అరుణ విజయంతో బీజేపీ శ్రేణుల్లో ఉత్సాహం నెలకొనగా.. బీఆర్‌ఎస్ రెండు సిట్టింగ్ స్థానాలనూ చేజార్చుకుంది. ఎమ్మెల్సీ ఉప ఎన్నికలో 'కారు' అభ్యర్థి విజయం సాధించడం ఒక్కటే ఆ పార్టీకి ఊరటనిచ్చే అంశం.



– సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్



ఎంపీగా గెలిచిన అనంతరం డీకే అరుణ విజయోత్సవ ర్యాలీ (ఫైల్)

– వివరాలు 8లో..

న్యూస్‌రీల్

రెండు రోజులు నీటి సరఫరా బంద్

నారాయణపేట: జిల్లాలోని మరికల్ నుంచి నారాయణపేట వెళ్లే దారిలో పెట్రోల్ బంక్ వద్ద మిషన్ భగీరథ పైపులైన్ రెండు ప్రదేశాలలో లీకేజీ కావడంతో మరమ్మతు నిమిత్తం నేటి నుంచి రెండు రోజులు నీటి సరఫరా నిలిపివేయనున్నట్లు మిషన్ భగీరథ గ్రిడ్ అధికారి పుట్ట వెంకట్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. మన్యంకొండ నీటి శుద్ధి కేంద్రం నుంచి నీటి సరఫరా అయ్యే దేవరకద్ర, నారాయణపేట మరియు మక్తల్ అసెంబ్లీ నియోజకవర్గాలలోని 245 గ్రామాలు, రెండు మున్సిపాలిటీల్లో నీటి సరఫరా జరగదని తెలిపారు. 29న సాయంత్రం 6 గంటల నుంచి 31న సాయంత్రం 6 గంటల వరకు నీటి సరఫరా నిలిపివేయనున్నట్లు, విషయాన్ని ప్రజలు గమనించాలని కోరారు.

అలసందలు @ 7,701

నారాయణపేట: స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డులో శనివారం అలసందలు క్వింటా గరిష్ట, కనిష్టంగా రూ.7,701 ధరలు పలికాయి. అలాగే, వడ్లు హంస గరిష్టం, కనిష్టంగా రూ.1,950, వడ్లు సోనా గరిష్టం రూ.2,569, కనిష్టం రూ.1200, నల్ల కందులు గరిష్టం, కనిష్టంగా రూ.7,500, ఎర్ర కందులు గరిష్టంగా రూ.8,671, కనిష్టంగా రూ.5,500, తెల్ల కందులు గరిష్టంగా రూ.8,908, కనిష్టంగా రూ.7,171 ధరలు పలికాయి.

31న ఎస్సీ ఉప వర్గీకరణపై అధ్యయనం

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): ఎస్సీ కులాల ఉప వర్గీకరణపై వివరణాత్మక అధ్యాయనం కోసం విచారణ కమిషన్ తరఫున ఈ నెల 31న జిల్లాకు తెలంగాణ హైకోర్టు మాజీ న్యాయమూర్తి డాక్టర్ జస్టిస్ షమీమ్ అక్తర్‌తో పాటు సభ్యులు రానున్నట్లు కలెక్టర్ విజయేందిర శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో భాగంగా కలెక్టరేట్‌లో సమావేశం నిర్వహిస్తారని పేర్కొన్నారు. ఉమ్మడి జిల్లా నుంచి సంబంధిత కులాల, వర్గాల ప్రజలు దరఖాస్తులు తీసుకురావాలని, వారి సమస్యలను చర్చిస్తామని తెలిపారు.

జనవరిలో పీయూకు న్యాక్ పీర్ కమిటీ

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: వచ్చే జనవరి నెలలో 23, 24, 25వ తేదీల్లో పాలమూరు యూనివర్సిటీ(పీయూ)కి న్యాక్ పీర్ కమిటీ రానుందని వీసీ శ్రీనివాస్ తెలిపారు. శనివారం పీయూలో వివిధ కళాశాలల ప్రిన్సిపాళ్లు, కోఆర్డినేటర్లతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. న్యాక్‌కు సంబంధించి అప్‌లోడ్ చేసిన డేటా ఏదైతే ఉందో అందుకు సంబంధించిన పూర్తి డాక్యుమెంట్లు అందుబాటులో ఉంచుకోవాలని అన్నారు. మౌలిక సదుపాయాల కోసం ప్రతిపాదనలను సిద్ధం చేసి త్వరగా పనులు పూర్తి చేయాలన్నారు. అందరి సమష్టి కృషితో మంచి గ్రేడింగ్ తీసుకు వచ్చేందుకు కృషిచేయాలని ఈ సందర్భంగా ఆయన సూచించారు.

పకడ్బందీగా ఇందిరమ్మ ఇళ్ల సర్వే



నారాయణపేట మున్సిపాలిటీలో సర్వే వేగవంతం చేయాలని ఆదేశిస్తున్న కలెక్టర్ సిక్తా పట్నాయక్

- నెలాఖరు నాటికి పూర్తి చేయాలి
- కలెక్టర్ సిక్తా పట్నాయక్
- అలసత్వం వహించిన సిబ్బందికి నోటీసులు జారీ చేయాలని ఆదేశం

నారాయణపేట/మక్తల్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల సర్వేను పకడ్బందీగా చేపట్టాలని.. ఈనెలాఖరు నాటికి పూర్తి చేయాలని కలెక్టర్ సిక్తా పట్నాయక్ ఆదేశించారు. శనివారం కలెక్టర్ నారాయణపేట మున్సిపాలిటీ, మండలం, మక్తల్‌లో ఇందిరమ్మ ఇళ్ల సర్వేను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. సర్వేకు సర్వర్ సమస్య వస్తుందని సిబ్బంది కలెక్టర్ దృష్టికి తీసుకురాగా, ఆఫ్‌లైన్ లో దరఖాస్తుదారుల వివరాలను నమోదు చేసుకొని తర్వాత ఆన్‌లైన్ చేసుకోవాలని ఆమె సూచించారు. మిగతా జిల్లాలతో పోలిస్తే మన జిల్లాలో సర్వే మందకొడిగా సాగుతుందని, సర్వేను వేగిరం చేసి నెలాఖరులోగా లక్ష్యాన్ని పూర్తి చేయాలని సిబ్బందిని ఆదేశించారు.

మున్సిపాలిటీలో సర్వే తీరుపై అసహనం

నారాయణపేట మున్సిపాలిటీ సర్వే నెమ్మదిగా సాగడంపై కలెక్టర్ అసహనం వ్యక్తం చేశారు. 7, 8 వార్డులలో సర్వేను పరిశీలించగా.. సర్వర్ రావడం లేదని వార్డ్ ఆఫీసర్ చెప్పడంతో కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. కారణాలు చెప్పకుండా సర్వేను వేగంగా చేపట్టాలని, మారుమూల ప్రాంతాలలో సర్వేను ఉదయం 7 గంటలకు ప్రారంభిస్తే, మున్సిపాలిటీలో వార్డు ఆఫీసర్లు ఉదయం 10 గంటల తరవాతే వెళ్తున్నారని, ఎవరెవరు ఎప్పుడు సర్వేకు వెళ్తున్నారో తాను ఆన్‌లైన్‌లో చూస్తూనే ఉన్నానని స్పష్టం చేశారు. సర్వే ఇంత నెమ్మదిగా జరుగుతుంటే మీరేం చేస్తున్నారని మున్సిపల్ కమిషనర్ సునీతపై అసహనం వ్యక్తం చేశారు. అత్యల్ప పనితీరు కనబర్చిన వార్డు అధికారులకు మెమోలు జారీ చేయాలని ఆదేశించారు. 29 సండే అయినా.. నో హాలిడే అని రెండు రోజుల్లో సర్వే వంద శాతం పూర్తయ్యేలా చూడాలని ఆదేశించారు.

- మక్తల్ మండలం సోమేశ్వర్‌బండ, లింగంపల్లి గ్రామాల్లో సర్వేను కలెక్టర్ తనిఖీ చేశారు. సోమేశ్వర్‌బండ నెట్‌వర్క్ రావడంలేదని, సర్వేకు ఇబ్బందిగా ఉందని అధికారులు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లగా.. అదనంగా మరొకరిని రప్పించి సర్వే వేగవంతం చేయాలన్నారు.

అట్రాసిటీ కేసుల్లో పరిహారం త్వరగా అందించాలి

నారాయణపేట: ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసుల్లో బాధితులకు నష్టపరిహారం త్వరగా అందించేందుకు సీ సెక్షన్, పోలీసు శాఖ అధికారులు సమన్వయంతో కృషి చేయాలని కలెక్టర్ సిక్తా పట్నాయక్ సూచించారు. శనివారం కలెక్టరేట్‌లో షెడ్యూల్ కులాలు తెగల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో సమావేశం ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఎస్సీ ఎస్టీ కేసులకు సంబంధించి బాధితులకు నష్టపరిహారం అందించడంలో ఆలస్యం ఎందుకు జరుగుతుందని ప్రశ్నించారు. బడ్జెట్ రాలేదని, ప్రతిపాదనలు పంపించడం జరిగిందని సి సెక్షన్ అధికారి తెలపగా.. బడ్జెట్ వచ్చిన వెంటనే రెండు వారాలకోసారి నష్టపరిహారం చెల్లింపు సిబ్బంది దృష్టి పెట్టాలని, ఇతర జిల్లాల అధికారులు ఎలాంటి నిబంధనలు పాటిస్తున్నారో తెలుసుకొని వాటినే అనుసరించాలని కలెక్టర్ సూచించారు. ప్రతి మూడు నెలలకోసారి జిల్లా స్థాయి విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సమావేశాలు తప్పనిసరిగా నిర్వహించాలని, ఎస్సీ ఎస్టీ విద్యార్థులకు ఉపకార వేతనాలు అందించాలన్నారు. డీఎస్పీ లింగయ్య పోలీస్‌స్టేషన్ల వారీగా నమోదైన, వివిధ స్థాయిల్లో ఉన్న ఎస్సీ ఎస్టీ కేసులు, వాటి వివరాలను, పరిహారం పెండింగ్‌లో ఉన్న వాటి వివరాలు వెల్లడించారు. సివిల్ రైట్స్ పై గ్రామాలలో అవగాహన సదస్సులు చేస్తున్నారా లేదా అని కలెక్టర్ అడగడంతో కొటేషన్ పద్ధతిలో అన్ని గ్రామాల్లో అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఎర్రగుట్ట వద్ద దళితులకు ఇచ్చిన భూమి పట్టాలలో ఇళ్లు నిర్మించి ఇవ్వాలని, నారాయణపేట మండలంలోని తండాలల్లో నీటి సమస్య తీర్చాలని, జిల్లా కేంద్రంలో సేవాలాల్ భవన నిర్మాణం చేపట్టని కారణంగా నిధులు వెనక్కి వెళ్లిపోయాయని పలువురు నాయకులు కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు. పరిశీలించాలని ట్రైబల్ వెల్ఫేర్ అధికారికి కలెక్టర్ సూచించారు. సమావేశంలో అడిషనల్ కలెక్టర్ బేన్ షాలం, ఆర్డీఓ రామచంద్రనాయక్, అధికారులు ఉమాపతి, సౌభాగ్యలక్ష్మి, అబ్దుల్ ఖలీల్, ఎంఎ రషీద్ జాన్ సుధాకర్ పాల్గొన్నారు.

గ్రామసభల ద్వారా లబ్ధిదారులను ఎంపిక చేయాలి

నారాయణపేట: రాష్ట్ర ప్రభుత్వం భూమిలేని నిరుపేదలకు ఏడాదికి రూ.12 వేలు ఇస్తామని ఎన్నికలకు ముందు హామీ ఇచ్చిందని.. ఈమేరకు గ్రామసభల ద్వారా లబ్ధిదారులను ఎంపిక చేసి.. అందజేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి గోపాల్, జిల్లా కార్యదర్శి బాల్ రాం, కాశప్ప ప్రభుత్వాన్ని కోరారు. శనివారం జిల్లా కేంద్రంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన రౌండ్ టేబుల్ సమావేశంలో వారు మాట్లాడారు. ఈ రెండు మూడు రోజుల్లో లబ్ధిదారులకు రూ.12వేలు ఇస్తామని చెప్పిన ప్రభుత్వం లబ్ధిదారులను ఏ రకంగా గుర్తించారో ప్రజలకు వివరణ ఇవ్వాలన్నారు. ఉపాధిహామి పథకంలో 100 రోజులు నిండిన కూలీలకు ఈ స్కీమ్ వర్తింపచేస్తామని ప్రభుత్వం అనడం సరైంది కాదన్నారు. తక్షణమే అఖిలపక్షం ఏర్పాటు చేసి గ్రామసభల ద్వారా భూమి లేని పేదలను గుర్తించి ఆ తర్వాత అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు. కుటుంబాలు విడిపోయి ఒంటరిగా నివసిస్తున్న వారికి భూమి లేదన్నారు. అలాంటి వాళ్లని గుర్తించి న్యాయం చేయాలన్నారు ఇప్పటికే ఉపాధి పథకంలో అనేక సమస్యలు నెలకొని ఉన్నాయని, వాటిని పరిష్కరించడంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందన్నారు. పెరుగుతున్న ధరలకనుగుణంగా ఉపాధి కూలీ రోజుకు రూ.600 ఇవ్వాలని, పని దినాలు 200 రోజులకు పెంచాలని వారు కోరారు. తక్షణమే గ్రామసభలు ఏర్పాటు చేసి సంక్రాంతిలోపు కూలీల అకౌంట్లో డబ్బులు జమ చేయాలన్నారు. ఆంజనేయులు, హన్మంతు, కృష్ణయ్య, సాయిలు, మహేష్, అశోక్ పాల్గొన్నారు.



రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న ప్రజా, కార్మిక, రైతు సంఘాల నాయకులు

రెవెన్యూ డివిజన్ ఏర్పాటుకు సహకరించండి

ఆత్మకూర్: ఆత్మకూర్‌ను రెవెన్యూ డివిజన్‌గా మార్చి పూర్వ వైభవం తీసుకొస్తానని మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి అన్నారు. శనివారం అఖిలపక్షం, రెవెన్యూ డివిజన్ సాధన సమితి ఆధ్వర్యంలో వందలాది మందితో కలిసి కలెక్టరేట్‌కు చేరుకొని కలెక్టర్ ఆదర్శ్ సురభిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఆత్మకూర్‌ను రెవెన్యూ డివిజన్‌గా ప్రకటించాలంటూ ఇదివరకే అసెంబ్లీలో ప్రస్తావించినట్లు గుర్తుచేశారు. ఇందుకు రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి సానుకూలత తెలిపారని, కలెక్టర్‌కు ఆదేశాలు ఇస్తున్నట్లు వెల్లడించినట్లు చెప్పారు. కలెక్టర్ స్పందించి రెవెన్యూ డివిజన్ ఏర్పాటుకు సహకరించాలని కోరారు. త్వరలోనే సమగ్ర నివేదికను ప్రభుత్వానికి అందజేస్తానని కలెక్టర్ హామీ ఇచ్చినట్లు వివరించారు.

నేడు డీఎస్పీతో 'సాక్షి' ఫోన్ ఇన్



నారాయణపేట: నూతన సంవత్సర వేడుకల్లో భాగంగా జిల్లాలో పోలీస్‌శాఖ ఎలాంటి చర్యలు చేపట్టనుంది. ఈవెంట్ల నిర్వహణ, డ్రంకెన్ డ్రైవ్, ట్రాఫిక్ నియంత్రణ, దేవాలయాలు, చర్చిలు ఇతర ప్రార్థన స్థలాల్లో బందోబస్తు తదితర అంశాలపై డీఎస్పీ లింగయ్యతో ఆదివారం 'సాక్షి' ఫోన్–ఇన్ నిర్వహిస్తోంది. పాఠకులు తమ సమస్యలు, సందేహాలను కాల్ చేసి నివృత్తి చేసుకోవచ్చు.



ఎస్.లింగయ్య, డీఎస్పీ నారాయణపేట

ఆదివారం ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు

ఫోన్ చేయాల్సిన నంబర్: 87126 70381

మధ్యాహ్న భోజనం నాణ్యతగా ఉండాలి



బిజ్వార్ పాఠశాలలో తరగతి గదులను పరిశీలిస్తున్న డీఈఓ గోవిందరాజులు

ఊట్కూరు: పాఠశాలల్లో విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజనం నాణ్యతగా ఉండాలని డీఈఓ గోవిందరాజులు అన్నారు. శనివారం మండలంలోని బిజ్వార్ ఉన్నత పాఠశాలను డీఈఓ సందర్శించారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించడంతో పాటు 10వ తరగతి వార్షిక పరీక్షల సన్నద్ధం గురించి ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. పదో తరగతి వార్షిక పరీక్షల్లో వంద శాతం ఉత్తీర్ణతతో సాధించేలా విద్యార్థులను తీర్చిదిద్దాలని సూచించారు. అనంతరం జీహెచ్‌ఎం, తెలుగు, పీఈటీ పోస్టులు ఖాళీగా ఉన్నాయని భర్తీ చేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు డీఈఓ దృష్టికి తీసుకెళ్లారు. కార్యక్రమంలో యాదయ్యశెట్టి, హెచ్‌ఎం కిశోర్‌కుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పరారీలో ఉన్న దొంగ అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ లింగయ్య.. చిత్రంలో స్వాధీనం చేసుకున్న బంగారు, వెండి ఆభరణాలు

- 2018లో తప్పించుకుని.. 2024లో దొరికాడు
- వివరాలు వెల్లడించిన డీఎస్పీ లింగయ్య

నారాయణపేట: సినీ ఫక్కీలో దొంగతనాలు చేస్తూ పోలీసుల చేతికి చిక్కి మహబూబ్‌నగర్ జైలు నుంచి 2018, ఆగస్టు 10న తప్పించుకున్న ఓ దొంగ 2024, డిసెంబర్ 27న మరికల్‌లో పోలీసులకు పట్టుబడినట్లు డీఎస్పీ లింగయ్య తెలిపారు. శనివారం జిల్లా పోలీసు కార్యాలయంలో పోలీసు అధికారులతో కలిసి నిర్వహించిన విలేకర్ల సమావేశంలో వివరాలు వెల్లడించారు. ఊట్కూర్‌కు చెందిన చాపలి భాస్కర్ మక్తల్, ఊట్కూరు, మద్దూరు తదితర ప్రాంతాల్లో రాత్రిళ్లు ఇంటి తాళాలు పగలగొట్టి చోరీలకు పాల్పడుతుండేవాడు. దొంగతనం కేసులో పోలీసులు అరెస్ట్ చేసి మహబూబ్‌నగర్ జైలుకు తరలించారు. 2018, ఆగస్టు 10న గొంతు కోసుకొని ఆత్మహత్య ప్రయత్నం చేయగా పోలీసులు చికిత్స నిమిత్తం ఎస్కార్ట్ వాహనంలో జనరల్ ఆస్పత్రికి తీసుకెళ్తుండగా తప్పించుకున్నాడు. కొంతకాలం బెంగళూరులో ఉండి అక్కడి నుంచి తిరిగి హైదరాబాద్‌కు వచ్చి కాటేదాన్ ప్రాంతంలో ఉంటూ కొంతకాలం కూలీ పని చేశాడు. తర్వాత చంపాపేట్ ప్రాంతంలోని సరస్వతినగర్‌కు తన మఖాం మార్చి అక్కడే ఉండేవాడు. ఖర్చులకు డబ్బులు సరిపోకపోవడంతో రెండేళ్లుగా దొంగతనాలు చేయడం ప్రారంభించాడు. నారాయణపేట, మరికల్, మక్తల్, వికారాబాద్ జిల్లాలోని కొడంగల్, బొంరాస్‌పేట, పరిగి ప్రాంతాల్లో చాలా దొంగతనాలు చేశాడు. శుక్రవారం తెల్లవారుజామున మరికల్‌లో దొంగతనం చేయడానికి రాగా పోలీసుల వాహన తనిఖీల్లో అనుమానాస్పదంగా కనిపిస్తే పట్టుకొని విచారించగా అసలు విషయం బయటకు వచ్చింది. ఇతను నారాయణపేట, మరికల్, మక్తల్, కోస్గిలో 13 దొంగతనాలు చేసినట్లు ఒప్పుకున్నాడు. 284 గ్రాముల బంగారం, 1,400 గ్రాముల వెండి, దొంగతనం చేయడానికి ఉపయోగించే ఇనుప కడ్డీ, బ్యాగును స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించినట్లు డీఎస్పీ వివరించారు. కేసు దర్యాప్తులో చురుగ్గా పనిచేసిన మరికల్, నారాయణపేట సీఐలు రాజేందర్‌రెడ్డి, శివశంకర్, మరికల్, నారాయణపేట ఎస్‌ఐలు రాములు, వెంకటేశ్వర్లు, క్రైమ్ సిబ్బంది రవీంద్రనాథ్, తిరుపతిరెడ్డి, లింగమూర్తి, ఆంజనేయులు, రాములును డీఎస్పీ అభినందించి క్యాష్ రివార్డ్ అందజేశారు.

క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో మాజీ ఎంపీటీసీ మృతి


గుల్ల చెన్నయ్య (ఫైల్‌ఫోటో)

బిజినేపల్లి : నాగర్‌కర్నూల్ మండలంలోని కుమ్మెరకి చెందిన మాజీ ఎంపీటీసీ గుల్ల చెన్నయ్య(45) శుక్రవారం రాత్రి రోడ్డు ప్రమాదానికి గురై మృతి చెందాడు. ఈఘటన బిజినేపల్లి మండలంలోని లింగసానిపల్లి–వసంతాపూర్ గ్రామాల మధ్య చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు.. వసంతాపూర్‌కి చెందిన ఒక రైతు నాగర్‌కర్నూల్ మిల్లుకు పత్తి అమ్మకానికి తీసుకెళ్లాడు. ఆపత్తి మిల్లులో దిగకపోవడంతో నాగర్‌కర్నూల్ నుంచి వసంతాపూర్‌కి ట్రాక్టర్‌తో తిరుగు ప్రయాణమయ్యాడు. మాజీ ఎంపీటీసీ చెన్నయ్య కుమ్మెర నుంచి నాగర్‌కర్నూల్‌కు బైక్‌పై వెళ్తున్నాడు. చీకటిగా ఉండటంతో ప్రమాదవశాత్తు చెన్నయ్యను ట్రాక్టర్ ఢీకొనడంతో అతడు అక్కడికక్కడే మరణించాడు. చెన్నయ్యకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

ఆటో, కారు ఢీ: నలుగురికి గాయాలు



ఉండవెల్లి: మండల కేంద్రంలోని సబ్‌స్టేషన్ సమీపంలో తాండ్రపాడు నుంచి చిన్న ఆముదాలపాడు గ్రామానికి వెళ్తున్న ఆటోను, కారు ఢీకొట్టడంతో నలుగురికి గాయాలయిన ఘటన శనివారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం బైరాపురం గ్రామానికి చెందిన నలుగురు వ్యక్తులు మద్యం మత్తులో కారు నడుపుతూ.. తాండ్రపాడు శివారులోని ఆల్కాలీస్ ప్రైవేట్ కంపెనీలో విధులు నిర్వహించి వస్తున్న కార్మికుల ఆటోను ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో ఆటో బోల్తా పడడంతో ఆముదాలపాడు గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ శ్రీరాములు తలకు, ప్రయాణికులు దేవారెడ్డి, నారాయణరెడ్డి చేతులకు, సుధాకర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. బాధితులను 108 వాహనంలో కర్నూల్ జనరల్ ఆస్పత్రికి తరలించారు. కారుతో పాటు ప్రమాదానికి కారణమైన వారిని పోలీస్‌స్టేషన్ తరలించి కేసు నమోదు చేశామని పోలీసులు తెలిపారు.

డీసీఎం ఢీకొని వ్యక్తి దుర్మరణం


వెంకటయ్య (ఫైల్)

కల్వకుర్తి రూరల్: మండలంలోని మార్చాల గ్రామపంచాయతీ పరిధిలో ఉన్న సూర్యలత కాటన్‌మిల్లు సమీపంలో శనివారం తెల్లవారుజామున డీసీఎం ఢీకొని ఓ వ్యక్తి మృతిచెందినట్లు పట్టణ రెండో ఎస్‌ఐ రాంచందర్‌జీ తెలిపారు. ఆయన కథనం మేరకు.. మార్చాలకు చెందిన వెంకటయ్య (40) పని నిమిత్తం కల్వకుర్తికి వచ్చి తిరిగి స్వగ్రామానికి నడుచుకుంటూ వెళ్తుండగా కల్వకుర్తి నుంచి జడ్చర్ల వైపు వెళ్తున్న డీసీఎం వెనుక నుంచి ఢీకొనడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. వెంకటయ్య కుమారుడు పవన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వివరించారు.

యువకుడి బలవన్మరణం

వనపర్తి రూరల్: పురుగుమందు తాగి ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నట్లు వనపర్తి రూరల్ ఎస్‌ఐ జలంధర్‌రెడ్డి తెలిపారు. ఆయన కథనం మేరకు.. వనపర్తి మండలం రాజపేటకు చెందిన తోకలి రాఘవేంద్ర (36) ఐదేళ్లుగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. జీవితంపై విరక్తి చెంది శనివారం ఉదయం ఇంట్లో ఎవరూ లేని సమయంలో మద్యంలో పురుగుమందు కలుపుకొని తాగాడు. గుర్తించిన భార్య అంజనమ్మ వెంటనే చికిత్స నిమిత్తం వనపర్తి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించింది. అక్కడ చికిత్స పొందుతూ మధ్యాహ్నం మృతి చెందాడు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ వివరించారు.

బిజ్వారంలో వ్యక్తి మృతి

మల్దకల్: మండలంలోని బిజ్వారంలో ఓ వ్యక్తి మూడురోజుల కిందట మృతిచెందగా శనివారం వెలుగు చూసింది. గ్రామస్తుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన వెంకటన్న (44) అదే గ్రామానికి చెందిన దరెమ్మను వివాహం చేసుకున్నాడు. కొంతకాలం తర్వాత వీరిద్దరి మధ్య మనస్పర్థలు రావడంతో ధరూరు మండలం చింతరేవులకు చెందిన పద్మమ్మను రెండో వివాహం చేసుకున్నాడు. ఇదిలా ఉండగా గ్రామ సమీపంలో ఉన్న పొలానికి భారీ డిమాండ్ రావడంతో వెంకటన్న విక్రయించాడు. వాటాల పంపకంలో ఇద్దరు భార్యలతో తరచూ గొడవలు పడుతుండేవాడు. వారం క్రితం వెంకటన్న అనారోగ్యానికి గురికాగా చికిత్స నిమిత్తం గద్వాల ప్రభుత్వ ఆస్పత్రికి అటు నుంచి కర్నూలుకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతిపై కుటుంబ సభ్యులు అనుమానాలు వ్యక్తం చేస్తుండటంతో పోలీసులు కేసు నమోదు చేశారు. వెంకటన్న మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు.

'షేక్'హ్యాండ్..!

పాలమూరులో కాంగ్రెస్‌కు మిశ్రమ ఫలితాలు

సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్:

ఉమ్మడి పాలమూరు జిల్లాలో ఈ ఏడాది రాజకీయ ముఖచిత్రం పూర్తిగా మారిపోయింది. అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ జోరు కొనసాగించగా.. పార్లమెంట్ ఎన్నికల్లో మహబూబ్‌నగర్ సీటు కమలం పార్టీ గెలిచి హస్తం పార్టీకి షాకిచ్చింది. స్థానిక సంస్థ ప్రజాప్రతినిధులు ఎమ్మెల్సీ ఉపఎన్నికల్లో కారు పార్టీ గెలుపొందింది. ఇక పార్లమెంట్ ఎన్నికల వేళ ప్రచారంలో భాగంగా ప్రధాని నరేంద్రమోదీ, కాంగ్రెస్ అగ్రనేతలు రాహుల్, ప్రియాంక, ఖర్గే, సీఎం రేవంత్‌రెడ్డి, మాజీ సీఎం కేసీఆర్‌తో పాటు రాష్ట్ర, జాతీయ స్థాయి నాయకులు, ఇతర రాష్ట్రాల ముఖ్యమంత్రులు ఉమ్మడి జిల్లాలో పర్యటించారు.

- మహబూబ్‌నగర్ పార్లమెంట్, ఎమ్మెల్సీ ఉప ఎన్నికల్లో బోల్తా
- ముఖ్యమంత్రి ప్రతిష్టాత్మకంగా తీసుకున్నా తప్పని పరాభవం
- డీకే అరుణ గెలుపుతో బీజేపీ శ్రేణుల్లో ఉత్సాహం
- బీఆర్‌ఎస్‌కు ఊరటనిచ్చిన నవీన్‌రెడ్డి విజయం


నారాయణపేటలో డీకే అరుణకు మద్దతుగా ప్రచారంలో పాల్గొన్న ప్రధాని మోదీ (ఫైల్)

హోరాహోరీగా ఎమ్మెల్సీ పోరు.. తప్పిన కాంగ్రెస్ అంచనాలు

కల్వకుర్తి అసెంబ్లీ స్థానం నుంచి ఎమ్మెల్యేగా ఎన్నికైన కసిరెడ్డి నారాయణరెడ్డి స్థానిక సంస్థల ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేయడంతో ఉప ఎన్నిక అనివార్యమైంది. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత మహబూబ్‌నగర్‌లో తొలిసారిగా వచ్చిన ఉప ఎన్నిక.. అందులోనూ సీఎం సొంత జిల్లాలో జరుగుతున్న ఎన్నిక.. ఎంపీ ఎన్నికలకు ముందస్తుగా వచ్చిన ఎన్నిక కావడంతో రాష్ట్రవ్యాప్తంగా అందరి దృష్టి ఇటువైపే నెలకొంది. ఇందుకు తగ్గట్టుగానే అటు బీఆర్‌ఎస్, ఇటు కాంగ్రెస్ తమతమ పార్టీలకు చెందిన స్థానిక సంస్థల సభ్యులను గోవా, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లోని తదితర ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన ప్రత్యేక క్యాంప్‌లకు తరలించి హోరెత్తించాయి. చివరకు జూన్ రెండో తేదీన ఫలితాలు వెలువడగా.. మొదటి నుంచీ గెలుపుపై ధీమాగా ఉన్న కాంగ్రెస్‌కు భారీ షాక్ తగిలింది. ఆ పార్టీకి చెందిన అభ్యర్థి మన్నె జీవన్‌రెడ్డిపై బీఆర్‌ఎస్ అభ్యర్థి నవీన్ కుమార్ రెడ్డి 109 ఓట్ల తేడాతో గెలుపొందారు.

బండ్ల టర్న్.. యూ'టర్న్'..

రివైండ్ 2024

మంత్రి జూపల్లితో ఉన్న సాన్నిహిత్యంతో బీఆర్‌ఎస్ నుంచి గెలుపొందిన గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి కారు దిగి జూలై 6న హైదరాబాద్‌లో సీఎం సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. బండ్ల రాకను వ్యతిరేకిస్తున్న జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ సరిత ఆ సమయంలో అక్కడే ఉన్నా.. ఈ కార్యక్రమానికి హాజరుకాలేదు. అయితే అదే నెల జూలై 30న ఆయన అసెంబ్లీ లాబీల్లో బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను కలవడంతో ఊహాగానాలు వెల్లువెత్తాయి. ఆయన మళ్లీ కారెక్కడం ఖాయమనే చర్చ జరిగింది. సరితతో వైరం మరింత ముదరడంతో రాజకీయ వర్గాలు అలానే భావించాయి. కానీ మహబూబ్‌నగర్‌లో ఇటీవల నిర్వహించిన రైతు సంబరాల్లో ఆయన కాంగ్రెస్ నాయకులతో కలిసి పాల్గొనడం ఊహాగానాలకు తెరపడినట్లయింది. కాగా.. మక్తల్‌కు చెందిన బీజేపీ సీనియర్ నేత, ఎమ్మెల్యేగా పోటీ చేసిన జలంధర్‌రెడ్డితో పాటు వివిధ నియోజకవర్గాలకు చెందిన పలువురు హస్తం గూటికి చేరారు.

ఇతర ముఖ్యాంశాలు..

- మార్చి 28న మహబూబ్‌నగర్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ పదవికి ఉప ఎన్నిక జరగగా.. జూన్ 2 తేదీన ఓట్ల లెక్కింపు చేపట్టారు. షెడ్యూల్ ప్రకారం ఏప్రిల్ 2న కౌంటింగ్ చేపట్టాల్సి ఉండగా.. ఎంపీ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల కమిషన్ వాయిదా వేసింది.
- ఏప్రిల్ 18న లోక్‌సభ ఎన్నికల నోటిఫికేషన్ వెలువడగా.. మే 13న ఎన్నికలు జరిగాయి. జూన్ నాలుగో తేదీన ఓట్ల లెక్కింపు చేపట్టి.. విజేతలను ప్రకటించారు. గత ఏడాది నవంబర్ 30న అసెంబ్లీ ఎన్నికలకు పోలింగ్ జరగగా.. అప్పటి నుంచి ఉన్న రాజకీయ సందడి పార్లమెంట్ ఎన్నికల వరకు కొనసాగింది.
- పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో పలు పార్టీల అతిరథులు, జాతీయ నేతలు పాలమూరును చుట్టేశారు. బీజేపీ అభ్యర్థుల తరఫున ప్రధాని మోదీ నాగర్‌కర్నూల్, నారాయణపేట.. కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా నాగర్‌కర్నూల్ బహిరంగసభల్లో మాట్లాడారు. వీరితోపాటు కిషన్‌రెడ్డి, బండి సంజయ్ తదితర నేతలు ప్రచారం చేశారు. కాంగ్రెస్ నాగర్‌కర్నూల్ ఎంపీ అభ్యర్థి మల్లు రవికి మద్దతుగా ఆ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ ఎర్రవల్లి చౌరస్తా సమీపంలో నిర్వహించిన బహిరంగసభలో ప్రజలనుద్దేశించి మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి ఎంపీ ఎన్నికల సమయంలో 10 పర్యాయాలు మహబూబ్‌నగర్ పార్లమెంట్ పరిధిలో పర్యటించగా.. ఆ తర్వాత ఇప్పటివరకు మరో నాలుగుసార్లు ఉమ్మడి జిల్లాకు వచ్చారు. మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్‌లో బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థులకు మద్దతుగా మాజీ సీఎం కేసీఆర్ రోడ్‌షో నిర్వహించారు. మాజీ మంత్రి హరీశ్‌రావు కొత్తకోటలో పర్యటించారు.
- రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత పలు కార్పొరేషన్లకు సంబంధించి నామినేటెడ్ పోస్టులను భర్తీ చేసింది. రాష్ట్ర మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్‌గా మహబూబ్‌నగర్‌కు చెందిన ఒబేదుల్లా కొత్వాల్, తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్‌గా వనపర్తికి చెందిన శివసేనారెడ్డి, పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్‌గా కొడంగల్‌కు చెందిన గుర్నాథ్ రెడ్డి నియమితులయ్యారు. వీరితో పాటు జిల్లా స్థాయిలో మరికొందరు కాంగ్రెస్ నాయకులకు పదవులు దక్కాయి. మహబూబ్‌నగర్ డీసీసీబీ, మహబూబ్‌నగర్ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (ముడా) చైర్మన్లతో పాటు మున్సిపల్ చైర్మన్లుగా పలువురు ఎన్నికయ్యారు. ఈ నేపథ్యంలో పార్టీకి చెందిన ఆయా వర్గాలు, శ్రేణుల్లో జోష్ నెలకొంది.


మక్తల్‌లో కాంగ్రెస్ ఎన్నికల ప్రచారం (ఫైల్)


నాగర్‌కర్నూల్ రోడ్ షోలో పాల్గొన్న మాజీ సీఎం కేసీఆర్ (ఫైల్)


మల్లు రవికి మద్దతుగా రాహుల్ ప్రచారం (ఫైల్)

సీఎం ఇలాకా.. తప్పని ఓటమి..

మహబూబ్‌నగర్ పార్లమెంట్ పరిధిలోకి ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలు మహబూబ్‌నగర్, జడ్చర్ల, దేవరకద్ర, మక్తల్, నారాయణపేట, షాద్‌నగర్, కొడంగల్ వస్తాయి. సీఎం రేవంత్ రెడ్డి కొడంగల్ నుంచి ఎమ్మెల్యేగా ప్రాతినిధ్యం వహిస్తుండగా.. మహబూబ్‌నగర్ పార్లమెంట్ నుంచి సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితుడు, మాజీ ఎమ్మెల్యే చల్లా వంశీచంద్‌రెడ్డి బరిలో నిలిచారు. బీజేపీ నుంచి మాజీ మంత్రి డీకే అరుణ, బీఆర్‌ఎస్ నుంచి సిట్టింగ్ ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి పోటీలో ఉన్నారు. ప్రధానంగా హస్తం, కమలం అభ్యర్థుల మధ్యే పోరు కొనసాగింది. డీకే అరుణ 4,500 ఓట్ల మెజార్టీతో చల్లాపై గెలుపొందారు. శాసనసభ ఎన్నికల్లో మహబూబ్‌నగర్ లోక్‌సభ పరిధిలోని అన్ని అసెంబ్లీ స్థానాల్లో కాంగ్రెస్ అభ్యర్థులు గెలుపొందగా.. పార్లమెంట్ ఎన్నికలు వచ్చే సరికి పరిస్థితి పూర్తిగా మారింది.

నాగర్‌కర్నూల్‌లో విజయం..

నాగర్‌కర్నూల్ (ఎస్సీ రిజర్వ్‌డ్) లోక్‌సభ స్థానం నుంచి ప్రధాన పార్టీలకు చెందిన మల్లురవి (కాంగ్రెస్), ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ (బీఆర్‌ఎస్), భరత్‌ప్రసాద్ (బీజేపీ) పోటీ పడ్డారు. ఇక్కడ త్రిముఖ పోరు నెలకొనగా.. మల్లు రవి 94,414 ఓట్ల మెజార్టీతో భరత్ ప్రసాద్‌పై గెలుపొందారు. మునుపెన్నడూ లేని విధంగా ఇక్కడ బీజేపీ అభ్యర్థికి 3,70,658 ఓట్లు రావడం.. రెండో స్థానానికి ఎగబాకడం చర్చనీయాంశమైంది.

ప్రభుత్వ సలహాదారుగా జితేందర్‌రెడ్డి..

అసెంబ్లీ ఎన్నికల తర్వాత మారిన రాజకీయ పరిణామాల క్రమంలో బీజేపీకి చెందిన సీనియర్ నేత ఏపీ జితేందర్‌రెడ్డి ఆ పార్టీకి గుడ్‌బై చెప్పారు. తన కుమారుడు అసెంబ్లీ ఎన్నికల్లో మహబూబ్‌నగర్ స్థానం నుంచి బీజేపీ అభ్యర్థిగా పోటీ చేసిన మిథున్‌రెడ్డితో కలిసి మార్చి 15న హైదరాబాద్‌లో సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. ప్రస్తుతం జితేందర్‌రెడ్డి ప్రభుత్వ సలహాదారుగా బాధ్యతలు చేపట్టారు.

వాకిటిని ఊరిస్తున్న మంత్రి పదవి..

పార్లమెంట్ ఎన్నికల సమయంలో సీఎం రేవంత్ వివిధ ప్రాంతాల్లో పర్యటించిన క్రమంలో ముదిరాజ్‌లకు రాష్ట్ర మంత్రివర్గంలో చోటు కల్పిస్తామని హామీ ఇచ్చారు. రాష్ట్రంలో గెలుపొందిన ఎమ్మెల్యేల్లో మక్తల్‌కు చెందిన వాకిటి శ్రీహరి ఒక్కరే ముదిరాజ్ వర్గానికి చెందిన వారు కాగా.. ఆయనకు ఖాయమనే సంకేతాలు వెలువడ్డాయి. అయితే పూర్తిస్థాయిలో రాష్ట్ర మంత్రి వర్గ కూర్పుపై అధిష్టానం ఆచితూచి వ్యవహరిస్తుండడంతో వాయిదా పడుతూ వస్తోంది.

హోరాహోరీగా కబడ్డీ పోటీలు


గద్వాల, ఆసిఫాబాద్ జట్ల మధ్య మ్యాచ్

- ఉత్కంఠగా సాగుతున్న సీఎం కప్
- సత్తాచాటుతున్న ఉమ్మడి జిల్లాలోని జట్లు


క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఎమ్మెల్యేలు యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, అనిరుధ్‌రెడ్డి

మహబూబ్‌నగర్ క్రీడలు: జిల్లాకేంద్రంలోని ప్రధాన స్టేడియంలో రాష్ట్రస్థాయి సీఎం కప్ కబడ్డీ పోటీలు హోరాహోరీగా సాగుతున్నాయి. టోర్నీలో పాల్గొన్న జట్లు నువ్వా.. నేనా అనే రీతిలో తలపడుతున్నాయి. కొన్ని మ్యాచ్‌లు చివరి నిమిషం వరకు ఉత్కంఠంగా సాగాయి.

దూకుడు ప్రదర్శనతో..

టోర్నీలో శనివారం రెండో రోజు జరిగిన మ్యాచ్‌లో బాలుర విభాగంలో మహబూబ్‌నగర్ జట్టు 35–22 పాయింట్ల తేడాతో మెదక్ జట్టుపై, వనపర్తి జట్టు 37–10 తేడాతో యాదాద్రి భువనగిరిపై, నారాయణపేట జట్టు 33–10 తేడాతో సిరిసిల్లపై, గద్వాల జట్టు 25–16 తేడాతో ఆసిఫాబాద్‌పై, నాగర్‌కర్నూల్ జట్టు 18–13 తేడాతో సిద్దిపేట జట్టుపై విజయ ఢంకా మోగించాయి. ఇతర మ్యాచుల్లో మేడ్చల్ జట్టు 33– 12 తేడాతో భూపాలపల్లిపై, కొత్తగూడెం జట్టు 34– 25 తేడాతో హన్మకొండపై, ఆసిఫాబాద్ జట్టు 32–30 తేడాతో నిర్మల్‌పై, సిద్దిపేట జట్టు 36–11 తేడాతో జగిత్యాలపై, హైదరాబాద్ జట్టు 26–10 తేడాతో సంగారెడ్డిపై, భువనగిరి జట్టు 38–25 తేడాతో మెదక్‌పై, రంగారెడ్డి జట్టు 37–19 తేడాతో భూపాలపల్లిపై, హన్మకొండ జట్టు 23–13 తేడాతో సూర్యాపేటపై, నల్లగొండ జట్టు 44–38 తేడాతో నారాయణపేటపై, ములుగు జట్టు 31–20 తేడాతో మహబూబ్‌నగర్‌పై, కామారెడ్డి జట్టు 34–18 తేడాతో సంగారెడ్డిపై, కరీంనగర్ జట్టు 24–17 తేడాతో మంచిర్యాల జట్టుపై, వనపర్తి జట్టు 25–8 తేడాతో ములుగుపై విజయం సాధించాయి.

రాణిస్తున్న మహిళా క్రీడాకారులు

టోర్నీలో మహిళా క్రీడాకారులు సైతం సత్తా చాటుతున్నారు. నారాయణపేట జట్టు 33–19 పాయింట్ల తేడాతో ఆసిఫాబాద్ జట్టుపై, గద్వాల జట్టు 52–23 తేడాతో వరంగల్‌పై, నాగర్‌కర్నూల్ జట్టు 27–3 తేడాతో పెద్దపల్లిపై, వనపర్తి జట్టు 38–18 తేడాతో మంచిర్యాలపై, సంగారెడ్డి జట్టు 40–6 తేడాతో మెదక్‌పై, వికారాబాద్ జట్టు 54–39 తేడాతో పెద్దపల్లిపై, నిజామాబాద్ జట్టు 41–36 తేడాతో కామారెడ్డిపై, నిర్మల్ జట్టు 34–26 తేడాతో సిద్దిపేటపై, కొత్తగూడెం జట్టు 34–4 తేడాతో ఆదిలాబాద్‌పై, వికారాబాద్ జట్టు 52–18 తేడాతో మెదక్‌పై, రంగారెడ్డి జట్టు 34–13 తేడాతో నిర్మల్‌పై, హైదరాబాద్ జట్టు 55–18 తేడాతో ఆసిఫాబాద్‌పై, జగిత్యాల జట్టు 41–40 తేడాతో ఖమ్మంపై, కొత్తగూడెం జట్టు 50–31 తేడాతో మహబూబ్‌నగర్‌పై, నాగర్‌కర్నూల్ జట్టు 40–7 తేడాతో సంగారెడ్డిపై, మేడ్చల్ జట్టు 51–42 తేడాతో నిజామాబాద్‌పై గెలుపొందాయి.

క్రీడాకారులకు సువర్ణావకాశం

సీఎం కప్ రెండో రోజు పోటీలకు మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. వారు క్రీడాకారులను పరిచయం చేసుకొని శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే యెన్నం మాట్లాడుతూ సీఎం కప్ గ్రామీణ క్రీడాకారులకు సువర్ణ అవకాశం లాంటిదన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఆనంద్‌గౌడ్, డీవైఎస్‌ఓ శ్రీనివాస్, ఉమ్మడి జిల్లా ఒలింపిక్ సంఘం ప్రధాన కార్యదర్శి కురుమూర్తిగౌడ్, జిల్లా ఎస్‌జీఎఫ్ కార్యనిర్వాహక కార్యదర్శి శారదాబాయి, జిల్లా వాలీబాల్ సంఘం కార్యనిర్వాహక కార్యదర్శి చెన్నవీరయ్య, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి వినోద్‌కుమార్, సుధాకర్‌రెడ్డి, నాగరాజు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

నాకౌట్ దశకు చేరిన జట్లు

మహబూబ్‌నగర్ క్రీడలు: రాష్ట్రస్థాయి సీఎం కప్ కబడ్డీ పోటీల్లో జిల్లాల జట్లు ప్రతిభచాటి నాకౌట్ దశకు చేరాయి. పురుషుల విభాగంలో రంగారెడ్డి, ములుగు, సిద్దిపేట, ఆసిఫాబాద్, హన్మకొండ, కరీంనగర్, కామారెడ్డి, నల్గొండ, కొత్తగూడెం, మంచిర్యాల, హైదరాబాద్, నారాయణపేట, మేడ్చల్, వనపర్తి, నాగర్‌కర్నూల్, గద్వాల, మహిళల విభాగంలో నల్గొండ, సంగారెడ్డి, కరీంనగర్, భూపాలపల్లి, ములుగు, వనపర్తి, మహబూబ్‌నగర్, హైదరాబాద్, రంగారెడ్డి, జనగాం, కొత్తగూడెం, నారాయణపేట, మేడ్చల్, నాగర్‌కర్నూల్, గద్వాల, మహబూబాబాద్ జట్లు నాకౌట్‌కు చేరాయి. నేటి నుంచి ఆయా జట్ల మధ్య ప్రీక్వార్టర్ ఫైనల్ మ్యాచ్‌లు జరగనున్నాయి.

జూరాలకు స్వల్ప ఇన్‌ఫ్లో

ధరూరు : ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు ఎగువ నుంచి స్వల్పంగా ఇన్‌ఫ్లోలు తగ్గినట్లు పీజేపీ అధికారులు తెలిపారు. శనివారం సాయంత్రం వరకు ప్రాజెక్టుకు 819 క్యూసెక్కులకు తగ్గిందన్నారు. ఆవిరి రూపంలో 89 క్యూసెక్కులు, కోయిల్‌సాగర్‌కు 315 క్యూసెక్కులు, ఎడమ కాల్వకు 225 క్యూసెక్కులు, కుడి కాల్వకు 600క్యూసెక్కులు ప్రాజెక్టు నుంచి మొత్తం 1,259 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటిమట్టం 9.657 టీఎంసీలు కాగా ప్రస్తుతం ప్రాజెక్టులో 8.010టీఎంసీల నీరు నిల్వఉన్నట్లు పీజేపీ అధికారులు తెలిపారు.

రామన్‌పాడులో 1,021అడుగుల నీటిమట్టం

మదనాపురం: రామన్‌పాడులో శనివారం పూర్తి స్థాయి నీటిమట్టం 1,021 అడుగులకు వచ్చి చేరింది. జూరాల ఎడమ కాల్వ 200 క్యూసెక్కులు సమాంతర కాల్వ ద్వారా వచ్చే నీటిని నిలిపేశారు. ఎన్టీఆర్ కాల్వ ద్వారా 211 క్యూసెక్కులు కుడి, ఎడమ కాల్వ ద్వారా 25 క్యూసెక్కులు, తాగునీటి అవసరాలకు 20క్యూసెక్కుల నీటిని వినియోగిస్తున్నట్లు ఏఈ వరప్రసాద్ తెలిపారు.

పంప్‌మోడ్ పద్ధతిలో 9,062క్యూసెక్కులు తరలింపు

దోమలపెంట: భూగర్భకేంద్రంలో పంప్‌మోడ్ పద్ధతిలో 24 గంటల వ్యవధిలో శ్రీశైలం ఆనకట్ట దిగువన సాగర్ జలాశయం నుంచి ఆనకట్ట ఎగువన శ్రీశైలం జలాశయంలోకి 9,062 క్యూసెక్కుల నీటిని (ఎత్తిపోతల) తరలించారు. పోతిరెడ్డిపాడు ద్వారా 1,500 క్యూసెక్కులు, ముచ్చుమర్రి, మల్యాల ఎత్తిపోతల నుంచి హెచ్‌ఎన్‌ఎస్‌ఎస్‌కు 1,688, ముచ్చుమర్రి నుంచి కేసీ కెనాల్‌కు 490, రేగుమాన్‌గడ్డ నుంచి ఎంజీకేఎల్‌ఐకు 2,400 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. శనివారం శ్రీశైలం జలాశయంలో నీటిమట్టం 862.0అడుగుల వద్ద 112.2100 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

సీఎమ్మార్ ధాన్యం చోరీ కేసులో.. 8 మంది రిమాండ్

ఎర్రవల్లి: సీఎమ్మార్ ధాన్యం చోరీ కేసులో 8 మందిని రిమాండ్ తరలించినట్లు ఇటిక్యాల ఎస్‌ఐ వెంకటేష్ తెలిపారు. ఎస్‌ఐ కథనం ప్రకారం.. మండలంలోని బీచుపల్లి విజయ వర్ధిని ఆయిల్ మిల్లు గోదాంలో ప్రభుత్వం కొనుగోలు సెంటర్ల ద్వారా చుట్టుపక్కల గ్రామాల రైతుల నుంచి కొనుగోలు చేసి నిల్వ చేసిన ధాన్యంలో 300 బ్యాగుల వడ్లను అపహరించి ఈ నెల 25న అర్ధరాత్రి నిందితులు డీసీఎంలో తరలించుకెళ్లారు. దీనిపై గోదాం ఇన్‌చార్జ్ హరినాథ్ రెడ్డి ఫిర్యాదు మేరకు 26న కేసు నమోదు చేసి దర్యాప్తును చేపట్టి చోరీకి పాల్పడిన 8 మంది నిందితులను అదుపులోకి తీసుకున్నామన్నారు. ఇందులో చోరీకి పాల్పడిన నిందితులు ఎ1 మేకల వెంకటేష్ (పెబ్బేరు), ఎ2 ఎం.ప్రభాకర్ (పెద్దఆముదాలపాడు), ఎ3 తోకలి విష్ణు (అమరచింత), ఎ4 మొగిలి వెంకటేశ్వర్‌రెడ్డి (ఉండ్యాల), ఎ5 చాకలి ప్రదీప్ (ఆర్.గార్లపాడు), ఎ6 కుర్వ అజిత్ (ఆర్.గార్లపాడు), ఎ7 హెచ్.హరిచంద్ర (ఆర్.గార్లపాడు), ఎ8 తెలుగు బీచుపల్లి (ఆర్.గార్లపాడు)లను అదుపులోకి తీసుకొని సీఐ రవిబాబు ఆదేశాల మేరకు శనివారం అలంపూర్ కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి రిమాండ్‌కు ఆదేశించారు. ఈ మేరకు నిందితుల నుంచి 300 బ్యాగుల వడ్ల బస్తాలను రికవరీ చేసి.. చోరీకి ఉపయోగించిన డీసీఎంను సీజ్ చేశామన్నారు. త్వరితగతిన చోరీ కేసును ఛేదించిన ఇటిక్యాల ఎస్‌ఐ వెంకటేష్, సిబ్బందిని సీఐ అభినందించినట్లు చెప్పారు.

డబ్బుల కోసం దాడి

ముగ్గురికి తీవ్ర గాయాలు.. ఏడుగురిపై కేసు నమోదు

మల్దకల్: డబ్బుల కోసం ఓ కుటుంబంపై దాడిచేసి తీవ్రంగా గాయపర్చిన ఘటన శుక్రవారం మండలంలోని పావనంపల్లిలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ నందికర్ కథనం మేరకు.. గ్రామానికి చెందిన పరశురాముడు అన్న తిమ్మప్ప అదే గ్రామానికి చెందిన రాజప్పకు డబ్బులు ఇవ్వాల్సి ఉండటంతో కొంతకాలంగా ఇరు కుటుంబాల మధ్య తరచూ గొడవలు జరుగుతుండేవి. ఈ క్రమంలో తిమ్మప్ప అనారోగ్యంతో మూడేళ్ల కిందట మృతిచెందాడు. తమకు ఇవ్వాల్సిన డబ్బులు చెల్లించాలంటూ పరశురాముడు కుటుంబంపై రాజప్ప ఒత్తిడి చేస్తూ వచ్చారు. శుక్రవారం రాత్రి రాజప్ప తన కుటుంబంతో కలిసి పరశురాముడు ఇంటికి వెళ్లారు. ఇద్దరి మధ్య మాటమాట పెరగడంతో గ్రామానికి చెందిన బీసన్న, రాజప్ప, ఆంజనేయులు, శివకృష్ణ, రేణమ్మ, జయలక్ష్మి, మహేశ్వరమ్మ కర్రలతో పరశురాముడు, సరోజమ్మ, పుణ్యవతి, సరస్వతి, రాఘవేంద్రపై దాడి చేశారు. ఈ దాడిలో ముగ్గురికి తీవ్రంగా గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం గద్వాల ప్రభుత్వ ఆస్పత్రికి అటు నుంచి కర్నూలు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. దాడి ఘటనలో ఏడుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ వివరించారు.

కిక్‌బాక్సింగ్‌లో జిల్లాకు 2 పతకాలు


పతకాలు సాధించిన జిల్లా విద్యార్థులతో రవినాయక్ తదితరులు

మహబూబ్‌నగర్ క్రీడలు: హైదరాబాద్‌లోని గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో శనివారం ముగిసిన రాష్ట్రస్థాయి సీఎం కప్ కిక్‌బాక్సింగ్ పోటీల్లో జిల్లా క్రీడాకారులు మెరుగైన ప్రతిభ కనబరిచారు. ఈ పోటీల్లో 32 కేజీ కేటగిరి విభాగంలో వరుణ్‌చంద్‌నాయక్ రజత పతకం, 42 కేజీల విభాగంలో వి.త్రిపుర యాదవ్ కాంస్య పతకం సాధించారు. వీరిని స్పోర్ట్స్ కిక్‌బాక్సింగ్ అసోసియేషన్ ఆఫ్ మహబూబ్‌నగర్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.రవి నాయక్ అభినందించారు.